# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శుక్రవారం 31, అక్టోబర్ 2025


## ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

*** ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్**

**ఆసిఫాబాద్, అక్టోబర్ 30, ప్రభాతవార్త**

వాహన చోదకులు తమ ప్రాణ రక్షణ కోసం హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలని జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ సూచించారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా రహదారి భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నిర్వహించిన బైక్ ర్యాలీని ఏఎస్పి చిత్తరంజన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ ర్యాలీ ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి ప్రారంభమై పట్టణంలోని ప్రధాన రహదారుల మీదుగా సాగి తిరిగి జిల్లా పోలీస్ కార్యాలయం వద్ద ముగిసింది. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ సమాజ భద్రత కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని, వారి త్యాగస్ఫూర్తి ప్రతి పోలీసు సిబ్బందిలో నిబద్ధతను, ధైర్యాన్ని పెంపొందిస్తుందన్నారు. ప్రతి రోజు జరిగే రోడ్డు ప్రమాదాలలో చాలా వరకు హెల్మెట్ ధరించకపోవడం వల్లే ప్రాణనష్టం జరుగుతోందని, హెల్మెట్ ధరించడం కేవలం చట్టపరమైన బాధ్యత మాత్రమే కాదని, అది మన ప్రాణ రక్షణకు అవసరమైన కవచంలాంటిదని, దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని తెలిపారు. ఈ ర్యాలీలో జిల్లా పోలీస్ అధికారులు, పోలీస్ సిబ్బంది, యువత, స్థానిక ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.



# వరి ధాన్యం కొనుగోళ్లలో గోల్‌మాల్..!



**కోటి 39 లక్షల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం**

**వ్యవసాయ అధికారి, మరి కొంత మందిపై క్రిమినల్ కేసులు నమోదు**

**చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ (సిఎస్) శశిధర్ రాజు**

**జైపూర్, అక్టోబర్ 30, ప్రభాతవార్త**

ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరతో రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేస్తుందని, ఈ ప్రక్రియలో అవినీతికి పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ (సిఎస్) శశిధర్ రాజు తెలిపారు. 2024-25 రబీ సీజన్ వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో మంచిర్యాల జిల్లాలోని జైపూర్ మండలం నర్సింగాపూర్ గ్రామంలో డిసిఎంఎస్ ఆధ్వర్యంలోని కొనుగోలు కేంద్రం నిర్వాహకులతో పాటు అవకతవకలలో భాగస్వామ్యులైన రామారావు పేట గ్రామంలోని సుముఖ ఆగ్రో ఇండస్ట్రీస్ యజమానులు, మండల వ్యవసాయ అధికారి, వ్యవసాయ విస్తరణాధికారి, 8 మంది రైతులు, ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్‌లపై రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య ఆదేశాల మేరకు పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకళ జైపూర్ పోలీస్ స్టేషన్‌లో 316 క్లాస్ 5, 318 క్లాస్ 4 సెక్షన్ల కింద క్రిమినల్ కేసు నంబర్ 207/25 నమోదు చేశారని తెలిపారు. ఈ కేసులో 1 కోటి 39 లక్షల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం చేశారని, జిల్లాలో 740 ఎకరాలలో 6 వేల 322.6 క్వింటాళ్ల ధాన్యమును 8 మంది రైతుల వద్ద నుండి కొనుగోలు చేసి 1 కోటి 39 లక్షల రూపాయలు జమ చేసినట్లుగా ఆన్‌లైన్ ప్యాడి ప్రొక్యూర్ మెంట్ మేనేజ్‌మెంట్ సిస్టంలో తప్పుడు సమాచారాన్ని నమోదు చేశారని, వీటితో పాటు రవాణా ఖర్చుల కింద 1.90 లక్షల రూపాయల ట్రక్ చిట్టీలు సృష్టించి నమోదు చేశారని తెలిపారు. జైపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయడం జరిగిందని, పోలీసు శాఖ ఆధ్వర్యంలో దర్యాప్తు కొనసాగుతుందని తెలిపారు.

రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో ఎవరైనా అవకతవకలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓఎస్‌డి శ్రీధర్ రెడ్డి, ఇన్స్‌పెక్టర్ అజయ్ బాబు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి కోపం... పంటలకు శాపం



**✦ అకాల వర్షంతో నేలమట్టమైన పంటలు ✦ తడిసిన ధాన్యం ✦ విలవిలలాడుతున్న రైతాంగం**

**పెంచికల్‌పేట్, బోథ్, అక్టోబర్ 30, ప్రభాతవార్త**

పెంచికల్ పేట్ మండల వ్యాప్తంగా బుధవారం రాత్రి కురిసిన అకాల వర్షం తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. గాలి వాన ఉధృతికి చేతికొచ్చిన పత్తి, వరి పంటలు నెలమట్టమైనవి, కొన్ని చోట్ల నీట మునిగాయి. ఏడాది కష్టం నీటిలో కలిసిపోయిందంటు రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. అధికారప్రజాప్రతినిధులు పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని వేడుకొంటున్నారు.

బోథ్ మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు సోయా, మొక్కజొన్న ధాన్యాలు తడిసిపోయాయి. రైతులు తాము పండించిన అరకొర పంటలనైన విక్రయిద్దామని వ్యవసాయ మార్కెట్‌కు తీసుకొచ్చి నెలరోజులు కావస్తున్న ఇప్పటివరకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాక రైతులు నానా అవస్థలు పడుకున్నారు. తీసుకువచ్చిన ధాన్యాన్ని ఆరబెట్టలేక చేలలో పండించిన పత్తినీ సేకరించలేక మిగతా 2లో..



**అడవి పందుల బారి నుంచి**

# పంటలను రక్షించాలి

*** కాగజ్‌నగర్ అటవీ శాఖ కార్యాలయం ఎదుట రైతుల ధర్నా**

**కాగజ్‌నగర్, అక్టోబర్ 30, ప్రభాతవార్త**

కాగజ్‌నగర్ మండలంలోని కోసిని,రేగుల గూడ,కూసుగుడా,దరిగాం వేంపల్లి ఇతర గ్రామాల రైతులు తమ పత్తి పంటను అడవి పందులు మొత్తం తిని నష్టం చేస్తున్నాయని తమకు నష్టపరిహారం చెల్లించాలని ఫారెస్ట్ రేంజ్ ఆఫీస్, కాగజ్‌నగర్ నందు ధర్నాకు దిగడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొని రైతుల పక్షాన బీఆర్‌ఎస్ సిర్పూర్ నియోకజవర్గ కన్వీనర్ లెండుగురె శ్యామ్‌రావ్ మాట్లాడుతూ కాగజ్‌నగర్ మండలంలోని చుట్టుపక్కల గ్రామాలలో సన్న కారు చిన్నకారు రైతులు మాత్రమే ఉన్నారని ఒక్కొక్క రైతుకు ఒకటి రెండు మూడు నాలుగు ఎకరాలు వరకే భూమి ఉందని,అందులో వేసిన పంటతోటే వారు జీవించాలని మిగతా 2లో..



# ప్రకృతి కోపం... పంటలకు శాపం

(మొదటిపేజీ తరువాయి)

సతమతమవుతున్నారు. దీనికి తోడు మార్కెట్లో పశువులు విచ్చలవిడిగా సంచరిస్తున్న పట్టించుకునే నాథుడే కరువయ్యారు. రైతులు పండించిన పంటలను కొనుగోలు చేయాలని ప్రత్యర్థులు రైతుల పక్షాన మాట్లాడుతూ ధర్నాలు చేపట్టగా కొందరు నాయకులు కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తాం అంటూ పేపర్ ప్రకటనలు ఇస్తున్నారే తప్ప రైతులకు భరోసా ఇవ్వలేకపోతున్నారు. ఇకనైనా ఆయా పార్టీల నాయకులు, అధికారులు రైతులు పండించిన పంటలను కొనుగోలు చేసేలా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించే విధంగా చర్యలు చేపట్టి రైతు పక్షాన నిలబడి రైతులు పండించిన చివరి గింజ కొనే వరకు రైతులకు భరోసా ఇవ్వాలని కోరుతున్నారు.

## అడవి పందుల బారి నుంచి

# పంటలను రక్షించాలి

(మొదటిపేజీ తరువాయి)

ఈ భూమి మాత్రమే వీరికి జీవనాధారం అని ఈ భూమిపై ఆధారపడి జీవిస్తున్నారని అటువంటిది అడవి పందులు రైతుల చేనులో వచ్చి చేతికిచ్చిన పంటను నాశనం చేస్తున్నాయని గత వారం రోజుల నుండి వందల ఎకరాలలో వేల సంఖ్యలో పందులు చొరబడి పంట నష్టం చేశాయని, అసలే రైతులు వారం రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలకు పంట మొత్తం నేల పాలు కాగా మిగిలిన పంటలు కూడా పందులు నాశనం చేశాయని వీరికి వెంటనే ప్రభుత్వం స్పందించి ఆటవి అధికారులు నష్టపోయిన వారి పంట సర్వే చేయించి తగిననష్టపరిహారం ఇవ్వాలని ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత వారంలో అధికారులకు తెలియజేసిన పందుల గురించి పట్టించుకోవడం లేదని మీరు రైతులను పట్టించుకోకుంటే రైతులు మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకునే పరిస్థితి నెలకొందని వాపోయారు. ఈ ప్రాంతంలో వీరి ఓట్లతో సీట్లు ఎక్కిన నాయకులు ఎమ్మెల్యే,ఎమ్మెల్సీ ఇప్పటివరకు రైతులను పట్టించుకోవడం లేదని రైతుల ఓట్ల మీద ఉన్న శ్రద్ధ రైతుల మీద లేదని వెంటనే ఆటవీ అధికారులు పంట నష్టాన్ని సర్వే చేయించి రైతులకు తగిన నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రైతుల పంటను పందుల బారి నుండి రక్షించాలని డిమాండ్ చేశారు.ఎఫ్ డి ఓ రైతుల ధర్నా ముందుకు వచ్చి ఆదుకోవాలని కోరగా ఎఫ్‌డీఓ స్పందించి రైతుల మాట్లాడుతూ రెండు రోజులలో ఆటవి బృందాలను పంపి రైతుల పంట నష్టాన్ని సర్వే చేయించి నష్టపరిహారం ఇవ్వడానికి, రైతుల పంటలను అడవి పందుల నుండి రక్షించడానికి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. దీనితో రైతులు ధర్నాను విరమించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామా రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నీల్వాయిలో కోతుల బెడద

**వేమనపల్లి, అక్టోబర్ 30, ప్రభాతవార్త**

నీల్వాయిలో కోతుల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామంలో అధిక సంఖ్యలో కోతులు సంచరిస్తూ, ఇంటి తలుపులు తెరుచుంటే చాలు లోనికి ప్రవేశించి, నిత్యవసర సరుకులు, పప్పులు, కూరగాయలు, తీసుకు వెళ్లడమే కాకుండా పిల్లలు, వృద్ధులపై దాడులకు పాల్పడుతున్నాయి. కోతుల సంఖ్య పెరగడంతో ప్రజలు ఇంటి తలుపులు మూసి వేసుకొని ఇంట్లోనే ఉండాల్సిన పరిస్థితి నెలకొందని పలువురు కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు నివాసం ఉంటున్న ఇండ్ల మధ్య ఇంటిపైన గుంపులు గుంపులుగా కోతులు సంచరిస్తూ భయాందోళనలకు గురిచేస్తున్నాయి. గ్రామ పంచాయతీ అధికారులు, అటవీశాఖ అధికారులు ఇప్పటికైనా స్పందించి కోతుల బెడద లేకుండా తగు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.



## 2కే రన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

**వేమనపల్లి, అక్టోబర్ 30, ప్రభాతవార్త**

సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా అక్టోబర్ 31న జాతీయ ఏక్తా దివాస్ వేడుకల సందర్భంగా నీల్వాయి ఎస్సై జగదీశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో రన్ ఫర్ యూనిటీ (2కే రన్)ను ఏర్పాటు చేశారు. శుక్రవారం ఉదయం 7 గంటలకు వేమనపల్లిలో పరుగు ఉంటుందని కావున యువతి, యువకులు ప్రజలందరూ పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఎస్సై పిలుపునిచ్చారు.

# సైబర్ మోసాలపై అవగాహన పెంచుకోవాలి

**మందమర్రి, అక్టోబర్ 30, ప్రభాతవార్త**

సైబర్ మోసాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని మందమర్రి ఏరియా సేఫ్టీ అధికారి భూ శంకరయ్య, ఎం.శ్రీనివాస రావు, డి.వై జి.ఎం (ఐ.టి) కార్పొరేట్ తెలిపారు. మందమర్రి జివిటిసి సమావేశ మందిరంలో గురువారం సైబర్ నేరాలపై ఉద్యోగులకు కల్పించే అవగాహన కార్యక్రమాలపై చర్చించారు. మినిస్ట్రీ ఆఫ్ కోల్ ఆదేశాల మేరకు నేషనల్ సైబర్ సెక్యూరిటీ అవగాహన నెలగా అక్టోబర్ నెలను ప్రకటించారని, దానికి అనుగుణంగా అధికారులు గనులపై కార్మికులకు అవగాహన కల్పించాలన్నారు. ఇటీవల సైబర్ మోసాలు పెరుగుతున్నాయన్నారు. ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన ఎలాంటి వ్యక్తిగత సమాచారాన్ని అపరిచిత వ్యక్తులకు తెలియజేయరాదన్నారు. ఈమెయిల్ సేఫ్టీ, మొబైల్ సేఫ్టీ, డిజిటల్ అరెస్ట్, మొదలగు విషయాల గురించి అవగాహన కల్పించారు. అనంతరం సైబర్ నేరాలపై నిర్వహించిన క్విజ్ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎం.శ్రీనివాస రావు డి.వై జి.ఎం (ఐ.టి) కార్పొరేట్, డి.ఎస్ నానా పర్నవేస్ డి.వై. సి.ఐ.ఎస్.ఓ-సింగరేణి, మందమర్రి జివిటిసి మేనేజర్ శంకర్, మందమర్రి డి.వై మేనేజర్ (ఐ.టి) రవి, జివిటిసి ట్రైనింగ్ అధికారి అశోక్, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారులు

## రేషన్ కార్డుదారులకు నాన్ ఓవెన్ సంచి పంపిణీ

**- మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య**

**నస్పూర్, ప్రభాతవార్త**




నిరుపేద, అర్హులైన రేషన్ కార్డుదారులకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం సన్న బియ్యం అందిస్తుందని, నవంబర్ 1వ తేదీ నుండి చౌక ధరల దుకాణాలలో రేషన్ కార్డుదారులకు నాన్ ఓవెన్ సంచి అందించడం జరుగుతుందని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా రేషన్ సన్న బియ్యం కొరకు ఒక వేలిముద్ర, నాన్ ఓవెన్ సంచి కొరకు ఒక వేలిముద్ర ఇవ్వవలసి ఉంటుందని తెలిపారు. ఏ చౌక ధరల దుకాణంలో రేషన్ కార్డు కలిగి ఉన్నారో అక్కడ మాత్రమే వేలిముద్రతో నాన్ ఓవెన్ సంచి ఇవ్వబడుతుందని, పోర్టబిలిటీ విధానం ద్వారా ఇతర షాపులలో రేషన్ బియ్యం పొందే వారికి నాన్ ఓవెన్ సంచి ఇవ్వబడదని, రేషన్ కార్డుదారులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

## సోయా, వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన ఎమ్మెల్యే

**సారంగాపూర్, అక్టోబర్ 30, ప్రభాతవార్త**

మండలం కేంద్రం లో అలాగే పలు గ్రామాలలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేను. మార్క్ పేడ్ ఆధ్వర్యంలో బోరిగాంలో సోయా,వడ్ల కొనుగోలు కేంద్రాన్ని, ఆలూరు గ్రామంలో డిఆర్‌డిఏ ఆధ్వర్యంలో పంట కొనుగోలు కేంద్రాలను బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. సోయా కనీస మద్దతు ధర క్వింటాల్ కు రూ॥ 5,328, వడ్ల కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ॥ 2,389లు ఉందని, రైతులు బయట మార్కెట్‌లో దళారులకు తక్కువ ధరకు అమ్మి మోసపోవద్దని సూచించారు. అకాల భారీ వర్షాల కారణంగా కల్లాల్లో ఎక్కడికక్కడ ధాన్యం తడిసిపోయి రైతులు ఆందోళన చెందుతున్న సందర్భంగా, ఈ క్లిష్ట సమయంలో ప్రభుత్వం రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ మద్దతు ధరతో తడిసిన ధాన్యాన్ని, ప్రతీ గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి.ఏ.సి.ఎస్ చైర్మన్ అయిర నారాయణ రెడ్డి సారంగాపూర్ మార్కెట్ చైర్మన్ మహమ్మద్ అది,ఎం.ఆర్.ఓ. సంధ్యారాణి మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి నాయకులు ముత్యం రెడ్డి, మేడిసెమ్మ రాజు, జిల్లా ఉపాధ్యక్షులు సత్యం చంద్రకాంత్, మండల అధ్యక్షులు నరేష్, మండల సీనియర్ నాయకులు రాజేందర్ రెడ్డి, రాంశంకర్ రెడ్డి, గంగారెడ్డి, కేవ్లా నాయక్, ప్రకాష్, దావోజి నాయక్, నారాయణ, జమాల్ , మండల ఉపాధ్యక్షులు తిరుమల చారి, విజయ్,మధు, రాజారెడ్డి, గణపతి, రంజిత్, మండల నాయకులు పోతన్న , చెన్న రాజేశ్వర్, గద్దర్, లక్ష్మణ్, ఉదయ్ సింగ్, జగదీష్, తో పాటు మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో ఎస్సీ సెల్ విభాగం తరపున నియామకం

**వెంగల్‌రావు నగర్ డివిజన్ కోఆర్డినేటర్‌గా జమ్మికుంట విజయ్‌కుమార్**

**బెల్లంపల్లి, అక్టోబర్ 30, ప్రభాతవార్త**



జూబ్లీహిల్స్ ఉపఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ విభాగం తరఫున బెల్లంపల్లికి చెందిన జమ్మికుంట విజయ్ కుమార్‌ను వెంగల్‌రావు నగర్ డివిజన్ కోఆర్డినేటర్‌గా నియమించారు. ఈ నియామకానికి కారణమైన ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరి ప్రీతమ్, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామిలకు జమ్మికుంట విజయ్‌కుమార్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన విశ్వాసానికి న్యాయం చేస్తూ పార్టీ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తానని ఆయన తెలిపారు.

## తుఫాన్ బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే వినోద్ వెంకటస్వామి అండ

**బెల్లంపల్లి, ప్రభాతవార్త**



బెల్లంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు 31వ వార్డు మహ్మద్ కాశీం బస్తీలో పెంతె తుఫాన్‌తో కూడిన అకాల వర్షం కారణంగా నాగమల్ల సోమయ్య ఇల్లు కూలిపోయింది. విషయం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగానే వెంటనే స్పందించిన వినోద్ బాధిత కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిపిఓ కృష్ణ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లెంకల శ్రీనివాస్ పట్టణ ఉపాధ్యక్షులు, ఇందిరమ్మ ఇల్లు కమిటీ సభ్యులు బుకాల రంజిత్ కుమార్ మంచిర్యాల జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, మాజి, లెంకల శ్రావణ్ కుమార్, మాజి కౌన్సిలర్ రాజలింగు, దేవరకొండ శ్రీనివాస్ పాల్గొన్నారు. స్థానిక బస్తీ ప్రజలు ఎమ్మెల్యే స్పందనపై సంతోషం వ్యక్తం చేశారు.

## బారెగూడలో ప్రారంభమైన సప్తహ కార్యక్రమం

**బెజ్జూర్, అక్టోబర్ 30, ప్రభాతవార్త**

బెజ్జూర్ మండలంలోని బారెగూడ గ్రామంలో గల హనుమాన్ ఆలయంలో గురువారం సప్తహ కార్యక్రమాన్ని గ్రామస్తులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏడు రోజులపాటు నిర్విరామంగా భక్తి గీతాల ఆలాపన, భజన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. నవంబర్ 6వ తేదీన గ్రామంలో శోభాయాత్ర నిర్వహించి ఈ కార్యక్రమాన్ని ముగించనున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున గ్రామస్తులు పాల్గొన్నారు.



## అయ్యప్ప ఆలయంలో చోరీ

**ఆసిఫాబాద్, అక్టోబర్ 30, ప్రభాతవార్త**



ఆసిఫాబాద్ పట్టణంలోని పెద్ద వాగు సమీపంలో ఉన్న అయ్యప్ప ఆలయంలో చోరీ జరిగినట్లు ఆలయ అర్చకుడు నాగేశ్వర్ శర్మ గురువారం తెలిపారు. అర్చకుడు తెలిపిన వివరాల ప్రకారం రోజువారి లాగానే గురువారం ఉదయం స్వామికి పూజలు నిర్వహించడానికి ఆలయంకు చేరుకున్నారు. గర్భగుడి ద్వారం ముందు ఏర్పాటుచేసిన హుండీ పైభాగము కట్ చేసి ఉండడాన్ని గమనించారు. దీనితో వెంటనే ఆలయ ఫౌండర్ కాంత్రి కిషన్‌కు సమాచారం అందించారు. దీంతో హుటాహుటిన ఆలయంకు చేరుకున్న ఆయన స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. దీనితో ఆలయంకు చేరుకున్న పోలీసులు ఆలయ ఆవరణను పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి హుండీని తెరువలేదని, గతంలో కూడా దుండగులు చొరబడి ఆలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సైతం ధ్వంసం చేశారని ఆలయ అర్చకుడు గుర్తుచేశారు. ఆలయంలో చోరీ జరిగిన విషయం తెలుసుకున్న స్థానిక భక్తులు అక్కడికి చేరుకున్నారు. ఇటువంటి చోరీలు పునరావృతం కాకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరారు.



## పోలీస్ అమరవీరుల త్యాగాలు మరవలేనివి

**దిలావర్పూర్, అక్టోబర్ 30, ప్రభాతవార్త**

పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని ఎస్సై రవీందర్ అన్నారు. పోలీస్ అమరవీరుల స్మారక వారోత్సవాలలో భాగంగా గురువారం దిలావర్పూర్ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ నుండి ఎక్స్ రోడ్డు వరకు పోలీసుల ఆధ్వర్యంలో క్యాండిల్స్ ర్యాలీ చేపట్టారు. ప్రజల రక్షణలో ప్రాణాలు అర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు స్మరణీయమని వారి సేవలకు కృతజ్ఞతగా ప్రతి ఒక్కరు గుర్తు చేసుకుంటూ సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొని అమరవీరుల పట్ల తమ గౌరవాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ, పోలీస్ సిబ్బంది, యువకులు ఉన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను పంపిణీ

**బెజ్జూర్, అక్టోబర్ 30, ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం 63 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను ఎంఎల్‌ఏ డా.పాల్వాయి హరీష్ బాబు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు వెంటనే ఇంటి నిర్మాణ పనులు మొదలు పెట్టాలని, 45 రోజుల్లోపు బేస్మెంట్ పూర్తి చేయని పక్షంలో వారి మంజూరు పత్రాన్ని క్యాన్సల్ చేసి ఇంకో లబ్ధిదారునికి ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. కొన్ని చోట్ల ఫారెస్ట్ అధికారులు ఇండ్ల నిర్మాణానికి అడ్డు వస్తున్నారని, గ్రామ పంచాయతీ తీర్మానంతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేసుకోవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీణ్, తహసిల్దార్ రామ్ మోహన్ రావు, పంచాయతీ కార్యదర్శులు, భాజాపా మండల అధ్యక్షుడు జాడి తిరుపతి,మాజీ ఎంపిపి కొప్పుల శంకర్, రాజారాం, వసీఉల్లఖాన్, భిక్షపతి, రాకేష్, దిగంబర్, తిరుపతి, దిలీప్, కిష్టయ్య, తిరుపతి గౌడ్, రమేష్, బాలకృష్ణ, తిరుపతి, సంజీవ్, సంతోష్, సత్యవాన్, శ్యామ్ సుందర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఏ

# అక్షరాస్యత పెంచడానికే ఉల్లాస్..

### - జిల్లా వయోజన విద్యాశాఖ అధికారి అజ్మేర పురుషోత్తం

**వేమనపల్లి, అక్టోబర్ 30, ప్రభాతవార్త**

సంపూర్ణ అక్షరాస్యత సాధించేందుకు ఉల్లాస కార్యక్రమం తోడ్పడుతుందని జిల్లా వయోజన విద్యాశాఖ అధికారి అజ్మేర పురుషోత్తం అన్నారు. గురువారం రోజున ఎంపిడిఓ కార్యాలయంలో ఉల్లాస్ కార్యక్రమం విజయవంతంగా అమలుకు చేయుట కొరకు వేమనపల్లి మండలంలోని ప్రతి గ్రామంలోని ఇద్దరు ఓబీలు, ఒక విఓఏలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంను ఉద్దేశించి మాట్లాడుతూ 15 సంవత్సరాలు పైబడిన నిరక్షరాస్యులకు అక్షరాలు నేర్పేందుకు ఉల్లాస్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అన్నారు. ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా గ్రామాలలో నిరక్షరాస్యులను గుర్తించి వారికి చదువు నేర్పించుట కొరకు వాలంటీర్ టీచర్స్ ను గుర్తించి ఉల్లాస్ ఆప్‌లో నమోదు చేయడం జరిగిందని, నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేసే ఈ కార్యక్రమం విజయవంతం చేయడానికి, ప్రతి గ్రామ సంఘం నుండి ఇద్దరు ఓ.బి లకు విఓఎలకు రాష్ట్ర స్థాయిలో శిక్షణ పొందిన సిఆర్పీలచే శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని గ్రామ స్థాయిలో ఉల్లాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. వేమనపల్లి కుమారస్వామి మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమానికి హాజరైన ఓబీ, విఓఎలు తమ గ్రామాలలో



వాలంటీర్లను, నిరక్షరాస్యులను సమన్వయపరిచి అక్షర కేంద్రాల ద్వారా వారిని అక్షరాసులుగా తీర్చిదిద్దాలని అన్నారు. ఈ కార్యక్రమాన్ని అంకితభావంతో అందరూ కలిసి విజయవంతం చేసి వేమనపల్లి మండలాన్ని మంచిర్యాల జిల్లాలో ప్రథమ స్థానంలో నిలబెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ క్వాలిటీ కోఆర్డినేటర్ సత్యనారాయణ మూర్తి,మండల విద్యాధికారి శ్రీధర్ రెడ్డి, సెర్ప్ నుండి వచ్చిన సీఆర్పీలు తిరుమల, అమీనా, వయోజన విద్య శాఖ డీఆర్పీ సుమన్, వేమనపల్లి మండలంలోని అన్ని గ్రామాల నుండి ఓబీ, విఓఎలు తదితరులు పాల్గొన్నారు.

## మెరుగైన వైద్య సేవలు అందించాలి

### - చీఫ్ మెడికల్ అధికారి కిరణ్ రాజ్

**తాండూర్,అక్టోబర్ 30,ప్రభాతవార్త**

సింగరేణి ఉద్యోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని చీఫ్ మెడికల్ అధికారి కిరణ్ రాజ్ అన్నారు. బెల్లంపల్లి ఏరియాలోని మాదారం, గోలేటిలోని సింగరేణి డిస్పెన్సరీలను గురువారం ఆయన సందర్శించారు. డిస్పెన్సరీ పరిసరాలను,మందులను తనిఖీ చేశారు. నిత్యం ఎంతమంది ఉద్యోగులు చికిత్స కోసం వస్తున్నారని స్థానిక వైద్యులను,వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు.పునరావాస కాలనీల్లో మొబైల్ హెల్త్ క్యాంప్‌లు ఏర్పాటుచేసి పునరాస కాలనీ వాసులకు వైద్య సేవలు అందించాలన్నారు.సింగరేణి ప్రభావిత ప్రాంతాలలో సీజనల్ వ్యాదుల పట్ల స్థానికులకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం ఏరియా జిఎం విజయ భాస్కర్ రెడ్డిని కలిసి ఉద్యోగులకు అందిస్తున్న వైద్య సేవలపై చర్చించారు. కార్యక్రమంలో డివైసీఎంఓ పాండు రంగాచారి,వైద్యులు మురళి, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న కోనేరు కృష్ణారావు

## యోగ్య హాస్పిటల్ ప్రారంభించిన మాజీ జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు

**కాగజ్‌నగర్,అక్టోబర్ 30, ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ మండలం ఈస్గాం శివాజీ చౌరస్తాలో వోడ్నాల చందు, పాలకుర్తి ప్రసాద్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన యోగ్య హాస్పిటల్‌ను జిల్లా మాజీ జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు గురువారం ప్రారంభించారు.ఈ సందర్భంగా కోనేరు కృష్ణారావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సదుపాయాలు మెరుగుపడితేనే ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయని తెలిపారు. వైద్య సేవలను వ్యాపారంగా కాకుండా సేవా ధ్యేయంగా చూడాలని వైద్య సిబ్బందిని సూచించారు. యోగ్య హాస్పిటల్ ద్వారా ఈస్గాం పరిసర గ్రామాల ప్రజలకు నాణ్యమైన వైద్య సదుపాయాలు అందుబాటులోకి రావడం సంతోషకరమన్నారు. ప్రజలకు సమయానుసారంగా వైద్య సలహాలు, అత్యవసర సేవలు అందించేందుకు వైద్యులు కృషి చేయాలని సూచించారు. స్థానిక ప్రజలు, కార్యకర్తలు హాస్పిటల్ ప్రారంభం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ కోనేరు కృష్ణారావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చిపర్శెట్టి శంకర్,మాజీ ఎంపీటీసీ అర్కిల్లా కుమార్,మాజీ సర్పంచ్ లక్షుఋఋఋ మ్రణ్,బొమ్మగోని సతీష్,పుధరి తిరుపతి,లోకండే నరేందర్,శ్రీకాంత్, ఉమాకాంత్,సురేష్,సిద్ధార్థ్,మండల నాయకులు, కార్యకర్తలు, వైద్య సిబ్బంది,గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## 2కె రన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

**మామడ, అక్టోబర్ 30, ప్రభాతవార్త**



సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి, ఎక్తా దివాస్‌ను పురస్కరించుకొని నేడు ఉదయం 6 గంటలకు న్యూ సంగ్వే ఎక్స్ రోడ్ నుండి చందారం గ్రామం వరకు 2కె రన్ నిర్వహించడం జరుగుతుందని, మండలంలోని యువతి,యువకులు, గ్రామప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మామడ ఎస్ఐ టి. అశోక్ పిలుపునిచ్చారు.

**రామకృష్ణాపూర్, అక్టోబర్ 30, ప్రభాతవార్త**

సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా నేడు జాతీయ ఏక్తా దివాస్ వేడుకలు ఘనంగా జరగనున్నాయి. ఈ సందర్భంగా రామకృష్ణాపూర్ పోలీసులు రన్ ఫర్ యూనిటీ (2కే రన్)ను ఏర్పాటు చేశారు. శుక్రవారం ఉదయం 6:00 గంటలకు ఠాగూర్ స్టేడియం నుండి రామాలయం ఏరియా వరకు పరుగు ఉంటుంది. పటేల్ ఆశయాలను స్మరించుకుంటూ, ప్రజలందరూ పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పట్టణ ఎస్సై రాజశేఖర్ పిలుపునిచ్చారు.

## కళ్యాణ లక్ష్మి, షాదీ ముభారక్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే

**సారంగాపూర్, అక్టోబర్ 30, ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని రైతువేదికలో మండలానికి చెందిన 31 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి షాదీ ముభారక్ చెక్కులను బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏమార్వో సంధ్యారాణి, ఎంపీడీఓ సూరప్రకాష్, మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, నాయకులు ముత్యం రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కరిపే విలాస్, జిల్లా ఉపాధ్యక్షులు సత్యం చంద్రకాంత్, మండల అధ్యక్షులు నరేష్, మండల సీనియర్ నాయకులు చంద్ర ప్రకాష్ గౌడ్, రాజేందర్ రెడ్డి, రాంశంకర్ రెడ్డి, సాహెబ్ రావ్, గంగారెడ్డి, ముత్యం రెడ్డి, కేవ్లా నాయక్, ప్రకాష్, దావోజి నాయక్, నారాయణ, జమాల్ , మండల ఉపాధ్యక్షులు తిరుమల చారి, విజయ్,మధు, మండల నాయకులు రాజరెడ్డి, సత్యపాల్ రెడ్డి, నర్సయ్య, లింగారెడ్డి, సాగర్ రెడ్డి, గంగాధర్, పోతన్న, చెన్న రాజేశ్వర్, లక్ష్మణ్, శేఖర్, గద్దర్, సబ్లె నానక్ సింగ్‌తో పాటు మండల నాయకులు కార్యకర్తలు, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# వరి, సోయా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే

## - తడిసిన ప్రతి ధాన్యం కొనుగోలు చేయాలి

**దిలావర్పూర్, అక్టోబర్ 30, ప్రభాతవార్త**

సోయా, వరి కొనుగోలు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. గురువారం దిలావర్పూర్ మండల కేంద్రంలో సోయా, వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. సోయా కనీస మద్దతు క్వింటాల్‌కు రూ॥ 5,328, వడ్ల కనీస మద్దతు ధర క్వింటాల్ రూ॥ 2,389లు ఉందని రైతులు బయట మార్కెట్‌లో దళారులకు తక్కువ ధరకు అమ్మి మోసపోవద్దని సూచించారు. అనంతరం తమ ధాన్యం అకాల వర్షాలకు తడిసిపోయిందని తేమశాతం తగ్గించి కొనుగోలు చేయాలని రైతులు ఎమ్మెల్యేను కోరారు. దీంతో ఆయన ధాన్యంలో పరిశీలించి నిర్వాహకులకు దాన్యమును వెంటనే తూకం వేసి తరలించాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కళ్యాణ లక్షి ్మ షాదీ ముబారక్ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. కాంగ్రెస్ ఎన్నికలలో ఇచ్చిన హామీని ఏడాదిన్నర గడిచినప్పటికీ నెరవేర్చలేదని తెలిపారు. షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి పథకాలలో పెంచి ఇస్తామన్న నగదు, తులం బంగారము ఇప్పటికి ఇవ్వలేదని పేర్కొన్నారు. అసెంబ్లీలో ఈ విషయంపై ప్రశ్నించానని ఎన్నికలలో ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు పోరాటం చేస్తానని పేర్కొన్నారు. ప్రజల వైపు నిలబడి



ప్రజా సమస్యపై కొట్లాడుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో ఏజాజ్ హైమత్ ఖాన్, ఎంపీడీవో అరుణ, రెవెన్యూ సిబ్బంది, సీనియర్ బిజెపి నాయకులు ముత్యంరెడ్డి, వీరేష్, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు సత్యం చంద్రకాంత్, ఉమా శంకర్, రాజలింగం, నిరంజన్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## - పెద్దపల్లి ఎంపీ వంశీ కృష్ణ

**జైపూర్, అక్టోబర్ 30,ప్రభాతవార్త**

రానున్న మూడు రోజుల్లో అధిక వర్షపాతం నమోదు అవుతుందని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో పెద్ద పల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ గురువారం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సోషల్ మీడియా వేదికగా విజ్ఞప్తి చేశారు. విద్యుత్ తీగలు, పురాతన, శిదిలావస్థలో ఉన్న భవనాలకు, భారీ వృక్షాలకు దూరంగా ఉండాలని సూచించారు. వర్షం కురుస్తున్న సమయంలో ప్రజలు బయటకు రావద్దని, నీటి ప్రవాహం ఉన్న రోడ్లపై వాహనాలు నడిపి ప్రమాదం బారిన పడవద్దని కోరారు. మండల, పంచాయతీ అధికారులు అప్రమత్తమై వరద ముంపు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని అన్నారు. ప్రభుత్వ అధికారలు అను నిత్యం ప్రజలకు సహాయం అందించుటకు సిద్ధంగా ఉండాలని అన్నారు.

# నీల్వాయి ఎస్సైగా జగదీశ్వర్ రెడ్డి

**వేమనపల్లి, అక్టోబర్ 30, ప్రభాతవార్త**




నీల్వాయి నూతన ఎస్సైగా జగదీశ్వర్ రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది ఆయనకు ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ కోసం నిరంతరం పనిచేస్తామన్నారు. అసాంఘిక కార్యక్రమాలు, జూదం, అక్రమ మద్యం తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ప్రజలకు ఏ అవసరం ఉన్న నేరుగా వచ్చి తమను కలవచ్చని ఆయన పేర్కొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

**చింతలమానేపల్లి, అక్టోబర్ 30, ప్రభాతవార్త**

మండలంలోని డబ్బా ఎక్స్ రోడ్డు ధరంపల్లి గ్రామానికి చెందిన చౌదరి శారదకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును బీజేపీ నాయకులు అందజేశారు. సిర్పూర్ శాసనసభ సభ్యులు డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు ఆదేశాల మేరకు బీజేపీ నాయకులు లబ్ధిదారిణి ఇంటికి వెళ్లి రూ॥ 30,000 విలువైన చెక్కును అందించారు. పేద రైతు కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకోకుండా ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అండగా ఉంటుందని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న బీజేపీ నాయకులు



# బెల్లంపల్లి ఏరియాలో సిఎంఓ పర్యటన

**బెల్లంపల్లి, అక్టోబర్ 30, ప్రభాతవార్త**

బెల్లంపల్లి ఏరియా గోలేటి, మాదారం బెల్లంపల్లిలో చీఫ్ మెడికల్ అధికారి కిరణ్ రాజ్ గురువారం పర్యటించారు. బెల్లంపల్లి ఏరియా ఆసుపత్రిలో వసతులు, ల్యాబ్‌లను తనిఖీ చేశారు. నిత్యం ఎంతమంది ఉద్యోగులు చికిత్స కోసం వస్తున్నారని ఆరా తీశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం గోలేటి, మాదారం డిస్పెంసరీలను సందర్శించారు. వైద్యులు, సిబ్బందికి సూచనలిచ్చారు. పునరావాస కాలనీల్లో మొబైల్ హెల్త్ క్యాంప్‌ల ద్వారా అందించే వైద్య సేవలను కొనసాగించాలని పేర్కొన్నారు. సీజనల్ వ్యాదుల పట్ల సింగరేణి ప్రభావిత ప్రాంతాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. జనరల్ మేనేజర్ కార్యాలయంలో జిఎం విజయ భాస్కర్ రెడ్డిని కలిశారు. ఏరియా పరిధి ఉద్యోగులకు అందిస్తున్న వైద్య సేవలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో డివైసీఎంవో పాండు రంగా చారి, వైద్యులు మురళి తదితరులు పాల్గొన్నారు.



# జూబ్లీహిల్స్ ఉపఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్సీ దండే విఠల్

**కాగజ్‌నగర్, అక్టోబర్ 30, ప్రభాత వార్త :**

జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉపఎన్నికల ప్రచారంలో భాగంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ పాల్గొన్నారు. ఎర్రగడ్డలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావుతో కలిసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు కోసం విఠల్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూజూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధి కోసం కాంగ్రెస్‌ను గెలిపించండి. నవీన్ యాదవ్‌కు ఒక అవకాశం ఇచ్చి మీ విలువైన ఓటుతో ఆశీర్వదించండి” అని ఓటర్లను కోరారు.



నిత్యవసర సరుకులు అందిస్తున్న బాలాజీ రావు

# నిత్యావసర సరుకులు అందజేత

**బెజ్జూర్, అక్టోబర్ 30, ప్రభాతవార్త**

బెజ్జూర్ మండల కేంద్రంలోని గోల్కొండలో పూసాల అంజలి దీనస్థితిని చూసి గురువారం కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన బాలాజీ రావు అనే వ్యక్తి వారి మిత్రులు మరో నలుగురితో కలిసి మూడు నెలలకు సరిపడా నిత్యవసర సరుకులను అందించారు. ఇట్టి సహాయాన్ని వారి గురువు పాండురంగారావు ఆదేశాల మేరకు చేసినట్లు వారు తెలిపారు. అంజలికి గతంలో తండ్రి మరణించగా, ఇటీవలే ఉన్న తల్లి కూడా మరణించింది. దీంతో ఎవరూ లేని ఒంటరిగా అంజలి దీన స్థితిలో ఉండాల్సి వచ్చింది. ఈ కార్యక్రమంలో అమీర్, పురుషోత్తం, లింగయ్య, నిహాల్ పాల్గొన్నారు.



ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

# మృతుల కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**రామకృష్ణాపూర్, అక్టోబర్ 30, ప్రభాతవార్త**

ఒకే కుటుంబానికి చెందిన భార్యాభర్తల మృతి పట్టణాన్ని విషాదంలో ముంచింది. సర్దార్ వల్లభభాయ్ నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ ఎలగందుల లింగయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, గురువారం ఆయన తొమ్మిదవ రోజు తిథి కర్మ సందర్భంలో ఆయన భార్య ఎలగందుల పద్మ కూడా తెల్లవారుజామున అనారోగ్యంతో కన్నుమూసింది. ఈ ఘటనతో స్థానికులు షాక్‌కు గురయ్యారు. దంపతులకు సంతానం లేకపోవడంతో పద్మ అక్క కుమారులు దహన సంస్కారాలు నిర్వహించారు. మృతుల కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తూ రామకృష్ణాపూర్ ఆటో యూనియన్, ఎస్ఆర్‌కె పాఠశాల యాజమాన్యం సానుభూతి వ్యక్తం చేశారు. లింగయ్య ఆటో డ్రైవర్‌గా, పద్మ ఎస్ఆర్‌కె పాఠశాలలో ఆయాగా పనిచేస్తూ కుటుంబాన్ని నడిపినట్లు పేర్కొన్నారు. వారి మరణం బాధాకరమని పాఠశాల యాజమాన్యం, ఆటో యూనియన్ నాయకులు విచారం వ్యక్తం చేశారు.

# విద్యాసంస్థల బంద్‌కు పూర్తి మద్దతు

**లక్షెట్టిపేట, అక్టోబర్ 30, ప్రభాతవార్త**

ఫీజు రియంబర్స్మెంట్ కోసం ప్రైవేట్ విద్యాసంస్థలు నిర్వహించే బంద్‌కు పూర్తి మద్దతు తెలుపుతున్నామని యుఎస్ఎఫ్ఎ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిరుపతి అన్నారు. గురువారం లక్షెట్టిపేటలో మీడియాతో మాట్లాడుతూ.. సకాలంలో రియంబర్స్మెంట్ చెల్లించకపోవడంతో ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు నవంబర్ 3 నుంచి బంద్ పాటించనున్నాయని తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఫీజు రియంబర్స్మెంట్ను వెంటనే చెల్లించాలని కోరారు.



## 2కే రన్ ను విజయవంతం చేయాలి

**తాండూర్, అక్టోబర్ 30,ప్రభాతవార్త**

సర్దార్ వల్లభాయ్ పటేల్ జన్మదినం (రాష్ట్రీయ ఏక్తా దివాస్ 2025) సందర్భంగా శుక్రవారం కండక్ట్ రన్ ఫర్ యూనిటీ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు తాండూర్ ఎస్సై కిరణ్ కుమార్ తెలిపారు. మాదారం పోలీస్ క్రీడ ప్రాంగణం నుండి ఉదయం 7 గంటలకు 2కే రన్ ప్రారంభమవుతుందన్నారు. 2కే రన్ లో క్రీడాకారులు, యువకులు, ప్రతి ఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేయాలని ఎస్సై కోరారు.



## గుట్టపై గుడుంబాకు గుడ్ బై...

**- యువకుల ఐక్యమత్యంతో అగర్ గూడ గ్రామంలో ఆవిరైన గుడుంబా**

**పెంచికల్‌పేట్, అక్టోబర్ 30, ప్రభాతవార్త :**

కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్ పేట్ మండలంలోని మారుమూల అటవీ ప్రాంతంలో గుట్టపై ఉన్న చిన్న గ్రామం అగర్ గూడ ఇప్పుడు పెద్ద మార్పుకు నాంది పలికింది. గురువారం గ్రామ పెద్దలు, యువకులు గ్రామంలో గుడుంబా తయారీకి, అమ్మకానికి పూర్తిగా నిషేధం విధిస్తు ఏకగ్రీవంగా తీర్మానం చేసి, పూర్తి గుడుంబా రహిత గ్రామంగా మార్పు పొందేందుకు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతు గ్రామంలో పెరుగుతున్న మద్యం వ్యసనం వల్ల అనేకమంది వ్యసనపరుల ఆరోగ్యాలు క్షిణించి కుటుంబాల ఆర్థిక పరిస్థితి చిన్నాభిన్నం అవుతుందాని, దాని ప్రభావంతో కుటుంబాల్లో నిత్యం గొడవలతో మహిళలు, పిల్లలు భాధలు అనుభవిస్తున్నారని, ఈ నేపథ్యంలో సార నిషేధంపై ఏకగ్రీవ తీర్మానం చేయడం జరిగిందన్నారు. ఇక మీదట ఎవరైనా గ్రామంలో గుడుంబా తయారు చేసిన అమ్మిన తీర్మాన పత్రంలో పేర్కొన్న నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## పేదల కలలను నెరవేర్చడమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యం

**- కాంగ్రేస్ జిల్లా నాయకులు జువ్వాజీ అనీల్ గౌడ్**

**తిర్యాని, అక్టోబర్30, ప్రభాతవార్త**

పేదల కలలను నిజం చేయడానికి ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు జువ్వాజీ అనిల్ గౌడ్ అన్నారు. తిర్యాణి మండలంలో మొర్రిగూడ గ్రామపంచాయతీలోని కోలాంగూడ గ్రామంలో గురువారం టేకం రాజుబాయి, ఆత్రం భీంబాయి, ఆత్రం ఇంద్రుబాయి, లచ్చుబాయి, బొజ్జుబాయి, భీంబాయిలకు మంజూరైన ఇందిరమ్మ ఇండ్లకు ఆయన భూమి పూజ చేశారు. అనంతరం నాయకపుగూడలో రేకులషేడ్ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు, ఈ సందర్భంగా జువ్వాజీ అనీల్ గౌడ్ మాట్లాడుతూ ప్రతి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇవ్వాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రూ. 5 లక్షలతో ఇండ్లను నిర్మించుకోవడానికి అవకాశం కల్పించిందన్నారు. ఇందిరమ్మ ఇండ్లు పేదలకు నూతన ఆశల నిలయంగా మారిందన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యేలా కృషి చేస్తామన్నారు. పేదల అభివృద్ధికి కాంగ్రేస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిత్తారిసాగర్, నాయకులు పెరుమళ్ళ వెంకటేశం గౌడ్, యూత్ మండల అధ్యక్షులు పున్నం హరీష్ కుమార్, సోషల్ మీడియా మండల కోఆర్డినేటర్ బొక్కెనపల్లి సాయికిరణ్, ఏలూమల లక్ష్మణ్, జూగునాక రావు, ఎలుముల మహేశ్, ముచ్చునేని శ్రీరామ్, భగవంత్ రావు, మారుతీ, జంగు, వినోద్, నాగేష్, బాధిరావు, అంకన్న, రంజిత్ గౌడ్, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.





సైకిల్ ర్యాలీలో పాల్గొన్న డీఎస్పీ వహిదుద్దీన్



మాట్లాడుతున్న డీఎస్పీ వహిదుద్దీన్

# ప్రతి ఒక్కరూ సమాజసేవలో భాగస్వాములు కావాలి

**- కాగజ్‌నగర్ డీఎస్పి వహిదుద్దీన్ - పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా సైకిల్ ర్యాలీ**

**కాగజ్‌నగర్ రూరల్, అక్టోబర్ 30, ప్రభాతవార్త :**

పోలీస్ అమరవీరులు సమాజ భద్రత కోసం ప్రాణాలను అర్పించి మనందరికీ ఆదర్శప్రాయులుగా నిలిచారని, వారి త్యాగాలకు మనమందరం గౌరవం తెలిపే విధంగా ప్రతి ఒక్కరూ సమాజ సేవలో భాగస్వాములవ్వాలని కాగజ్‌నగర్ డీఎస్పీ వహిదుద్దీన్ అన్నారు. గురువారం పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా కాగజ్‌నగర్ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. సైకిల్ ర్యాలీ కార్యక్రమాన్ని కాగజ్‌నగర్ డిఎస్పి వహిదుద్దీన్ ప్రారంభించారు. పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా ర్యాలీ కొనసాగింది. ప్రజల్లో పర్యావరణ రక్షణపై అవగాహన తెలిపారు. ఈ సందర్భంగా డిఎస్పి వాహిదుద్దీన్ మాట్లాడుతూ స్వచ్ఛమైన వాతావరణం–సురక్షితమైన భవిష్యత్తు అనే నినాదంతో సైకిల్ ర్యాలీ కొనసాగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ టౌన్ సీఐ ప్రేమ్‌కుమార్, రూరల్ సీఐ కుమారస్వామి, ఎస్ఐలు సుధాకర్, లక్ష్మణ్, కళ్యాణ్, సందీప్, పోలీస్ సిబ్బందితో పాటు, వివిధ పాఠశాలల విద్యార్థులకు, క్రీడాకారులకు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## టెన్త్ లో మెరుగైన ఫలితాలు సాధించాలి

**- జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య**

**తాండూర్, అక్టోబర్ 30, ప్రభాతవార్త:**



రాబోయే వార్షిక పరీక్షల్లో టెన్త్ విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని మంచిర్యాల జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య అన్నారు. మండలంలోని రేచిని జెడ్పిహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాలలను గురువారం విద్యాశాఖ అధికారి సందర్శించారు. పాఠశాల పరిసరాలు, మౌలిక వసతులు, మధ్యాహ్న భోజనాన్ని డీఈవో పరిశీలించారు. డీఈఓ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకొని ప్రణాళిక బద్ధంగా ఇష్టపడి చదివి ఉత్తమ మార్కులు సాధించాలని సూచించారు. రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైన రజిత, హర్షిత అనే విద్యార్థులను డీఈవో శాలువాతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి మల్లేష్, ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు రవికుమార్, ఉపాధ్యాయులు బట్టారి వెంకటేశ్వర్లు, రత్నయ్య, సతీష్ కుమార్, రవిబాబు, కృష్ణ గౌడ్, శ్రీలత, సుకుమాంజలి, సంతోష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఆలయం ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే

**సారంగాపూర్, అక్టోబర్ 30, ప్రభాతవార్త**

మండలంలో ప్రసిద్ధి చెందిన అడెల్లి మాహ పోచమ్మ విగ్రహ ప్రతిష్టాపన నవంబర్ 7 న నిర్వహించడం జరుగుతుందని బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి గారు తెలిపారు. నవంబర్ 3వ తేదీ నుంచి నవంబర్ 7 వరకు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇక్కడికి తెలంగాణ రాష్ట్ర నలుమూలల నుండి మహారాష్ట్ర నుండి సైతం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారని తెలిపారు. విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో భాగంగా అన్ని ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. అనంతరం విగ్రహ ప్రతిష్టాపన ఏర్పాట్లను, ఆలయ పరిసరాలను, పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ భూమయ్య, అమ్మ వారి మాలధారణ భక్తులు. అయిర నారాయణ రెడ్డి, జిల్లా మండల బీజేపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## బదిలీపై వెళ్తున్న ఎస్ఓటు జీఎంను సన్మానించిన జీఎం రాధాకృష్ణ

**మందమర్రి, అక్టోబర్ 30, ప్రభాతవార్త**



మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో, మందమర్రి ఏరియాలో ఎస్ఓటు జీఎంగా విధులు నిర్వహించిన విజయ ప్రసాద్‌ను గురువారం మందమర్రి ఏరియా నుండి బదిలీ పై జిఎం. హెచ్ఆర్డి కార్పొరేట్ వెళ్తున్న సందర్భంగా మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ, మందమర్రి ఏరియా అధికారులు జ్ఞాపికను అందజేసి, శాలువా కప్పి, ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ, ప్రతి ఒక్క అధికారి ఉన్న స్థలము నుండి వేరొక స్థలంలోకి బదిలీపై వెళ్లడం అనివార్యమని అన్నారు. ఈ సందర్భంగా ఎస్ఓటు జీఎంగా విజయ ప్రసాద్ మందమర్రి ఏరియాలో చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి రీజియన్ జిఎం సేఫ్టీ రఘు కుమార్, పర్సనల్ మేనేజర్ ఎస్. శ్యాంసుందర్, మందమర్రి ఏరియా హెచ్ఓడిలు పాల్గొన్నారు.



## సైన్స్ కిట్స్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

**ఆసిఫాబాద్, అక్టోబర్ 30, ప్రభాతవార్త**

సైన్స్ కిట్స్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సైన్స్ అధికారి కటుకం మధూకర్, డ్రీం ట్రస్ట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బోండ్ల కృష్ణారెడ్డి పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో డ్రీమ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు సైన్స్ కిట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో 50 ప్రభుత్వ పాఠశాలలకు సైన్స్ కిట్స్ పంపిణీ చేయబడతాయని, కెరీర్ గైడెన్స్, జీవన నైపుణ్యాల శిక్షణతో పాటు ఉపాధ్యాయులకు ప్రయోగాల బోధనలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. నాలెడ్జ్ హబ్ మేనేజర్ రవిమణి మాట్లాడుతూ పాఠశాలలకు సైన్స్ కిట్స్ అందించడమే కాకుండా ఉపాధ్యాయులకు వాటి వినియోగంపై ప్రత్యేక శిక్షణ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ అధికారి దేవాజీ, పరీక్షల సహాయ కమిషనర్ ఉదయబాబు, సూపరింటెండెంట్ శ్రీనివాస్, కోఆర్డినేటర్ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

# నౌకదళంలో సేవలందించిన మారుమూల గిరిజన బిడ్డ..

**★ పదవి విరమణ చెందిన రవీందర్ చవాన్ ★ దేశసేవ చేసి నేడు స్వగ్రామానికి పయనం**

**★ నావిక దళంలో సేవ చేసినందుకు గర్వంగా ఉందంటున్న గ్రామస్తులు**



**లింగాపూర్, అక్టోబర్ 28, ప్రభాతవార్త**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని మారుమూల మండలం నుంచి నేవి ఉద్యోగం సాధించిన మొదటి గిరిజన బిడ్డగా చవాన్ రవీందర్ నిలిచాడు. మండలంలోని మామిడిపల్లి (పికళాతండా) గ్రామానికి చెందిన చవాన్ భీమ్ సింగ్, తోతిబాయి లది నిరుపేద వ్యవసాయ కుటుంబం, అతనికి 8 మంది సంతానం వారిలో నాల్గవ కుమారుడైన చవాన్ రవీందర్. చిన్నతనం నుంచి పేదరికనే జయిస్తూ, ఐదు సంవత్సరాల వయసు ఉన్నప్పుడే తండ్రిని కోల్పోయి ,ఆనాటి కాలంలో మండలంలో చదువుకోవాలంటే ప్రభుత్వ పాఠశాలలు కూడా లేకుండే, చిన్నతనం నుంచి చదువుపై ఇష్టాన్ని పెంచుకొని ఒకటవ తరగతి నుంచి 5వ తరగతి వరకు ఉట్నూర్ ప్రభుత్వ పాఠశాలలో, కాలినడకన వెళ్లి చదువు నేర్చుకున్నారు ఆసమయంలో లింగాపూర్ మండలానికి రోడ్డు సౌకర్యాలు, వాహనాలు రావడం బస్సు సౌకర్యాలు కూడా లేని రోజులు, ఏదైనా సాధించాలి అన్న తపనతో, ఆరవ తరగతి నుంచి పదవ తరగతి వరకు, కరీంనగర్ లో చదువుకున్నారు , భద్రాచలంలో ఇంటర్మీడియట్ పూర్తిచేసు కొని నేవీ పరీక్ష రాసుకున్నారు, తొలి ప్రయత్నం లోనే నేవిలో 1987 లో ఇండియన్ కోస్ట్ గార్డ్ గా ఉద్యోగంలో చేరాడు. దేశంలో విదేశాల్లో ఇప్పటివరకు ఏ మచ్చ లేకుండా తన విధులను నిర్వహించుకొని 1991 లో 2022 సంవత్సరంలో క్వింటాల్ వెండి బంగారం తో కూడిన పాకిస్తాన్ బోటును సముద్రంలో పట్టుకున్నారు. శ్రీలంకలోని జప్నా ఆపరేషన్ లో పాల్గొని ప్రభుత్వం నుంచి ఎన్నో అవార్డులు అందు కున్నారు. ఎల్లప్పుడు దేశం కోసం ఆలోచించి 57 సంవత్సరాలు నిండిన దేశ సైనికుడు ఈనెల 31 అక్టోబర్ నెలలో రిటర్మెంట్ అవుతున్నారు.1994లో ఢిల్లీలో రిపబ్లిక్ పేరెంట్ సందర్భంగా జరిగిన మార్చ్ ఫాస్ట్ లో పాల్గొన్నారు. అప్పటి రాష్ట్రపతి శ్రీ శంకర్ దయాల్ శర్మ. గారి చేతులు మీదుగా ప్రశంస







పత్రం అందుకున్నా.1991లో 2012లో అండమాన్ నికోబార్ దీవుల్లో విధులు నిర్వహించుకునే సమయములో ,అక్కడ ఉన్న జరవాలా డెవలప్మెంట్ కొరకు కృషి చేశారు. తొలి ప్రయత్నం లోనే నౌక దలంలో ఉద్యోగం సాధించిన గిరిజన బిడ్డ చవన్ రవీందర్ రిటర్మెంట్ అయి సొంత గ్రామమైన మామిడిపల్లి (పిక్లా నాయక్ తాండకు) వచ్చేస్తున్నందుకు వారి కుటుంబ సభ్యులు, చవాన్ తోతి బాయి, గ్రామస్తులు, మండల వాసులు తదితరులు సంతోషాన్ని వ్యక్తం చేశారు

# సారూ..! వంతెన పనులు పూర్తి చేయండి

**✻ పిల్లర్ దశలోనే ఆగిపోయిన వంతెన నిర్మాణ పనులు ✻ వర్షాకాలంలో నాటు పడవలే దిక్కు**

**ఆసిఫాబాద్, ప్రభాతవార్త**

కుమురం భీం జిల్లా కేంద్రానికి కుతవేటు దూరంలోని గుండి గ్రామంలో వంతెన లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతీ ఏడాది వర్షాకాలంలో వాగు ఉప్పొంగినప్పుడల్లా ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని నడుచుకుంటూ ప్రజలు వాగు దాటుతున్నారు. వాగు దాటాడానికి తాత్కాలికంగా వంతెన నిర్మించుకున్నా నీటి ప్రవాహం దాటికి ఆ వంతెన కొట్టుకొని పోతోంది. పూర్తిగా స్థాయిలో వంతెన నిర్మాణం కోసం 2006లో శంకుస్థాపన చేయగా, పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ పనులను పిల్లర్ దశ వరకు చేసి నిలిపివేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరిస్తామని, వంతెన నిర్మాణం పూర్తయ్యే వరకు ఓటు వేయమని గ్రామస్తులు తీర్మానం చేసుకొని కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. కానీ వివిధ పార్టీల నాయకులు హామీ ఇవ్వడంతో ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. దీనితో తిరిగి గత జనవరిలో పనులు ప్రారంభించినా నత్తనడకన కొనసాగినా ప్రస్తుతం పనులు నిలిచిపోయాయి.

### వంతెన లేక అదనంగా 30 కిలోమీటర్లు ప్రయాణం...

ఆసిఫాబాద్ మండల కేంద్రానికి 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న గుండి గ్రామానికి వంతెన లేకపోవడంతో అదనంగా 30 కిలోమీటర్లు తిరిగి జిల్లా కేంద్రానికి చేరుకోవాల్సి న పరిస్థితి నెలకొందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుండి గ్రామానికి వెళ్లే వాగుపై వంతెన నిర్మాణం పనులు అసంపూర్తిగా ఉండడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రానికి చేరుకోవాలంటే దుబ్బాగూడ, కోమటిగూడ నుంచి తిరిగి రావాల్సి న పరిస్థితి ఉందని, అత్యవసర పరిస్థి తిలో కనీసం 108 వాహనం కూడా రాక అనేక అవస్థలు పడుతున్నారు.





దీనితో ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని నాటు పడవల్లో వాగును దాటుతున్నారు. వర్షాకాలంలో రైతులు ఎరువులు, విత్తనాలు, ఇతర పనులకు తప్పనిసరిగా జిల్లా కేంద్రానికి రావాలిసిందే. ఆ సమయంలో వాగులు ఉప్పొంగితే రైతులతో పాటు పాఠశాల, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. 2006లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం వంతెన నిర్మాణానికి రూ. 3.60 లక్షలు మంజూరు చేయగా శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. పిల్లర్ దశ వరకు పనులు చేసి వదిలేశారు. రీటెండరింగ్లో భాగంగా వంతెన నిర్మాణ పనుల కోసం మరో రూ.3.25 కోట్లతో టెండర్ కూడా పూర్తయ్యింది. కానీ పనులు మాత్రం నెమ్మదిగా జరుగుతుండడంతో గ్రామస్తులకు తిప్పలు తప్పడం లేదు.

### ఇదే తరహాలో మరిన్ని వంతెనలు......

మండలంలోని అప్పపల్లి వాగుపై ఏప్రిల్‌లో రూ.1.86 లక్షలతో వంతెన పనులు ప్రారంభిం చారు. కానీ ఈ పనులు పూర్తయ్యేలా కనిపించడం లేదు. ఇక్కడ సైతం వంతెన లేక పోవడంతో అప్పపల్లి, ఆర్ఆర్ కాలనీ ప్రజలకు ఇబ్బందులు తప్పేలా లేవు. అప్పపల్లి వాగుపై నిర్మిస్తున్న వంతెన పనుల్లో వేగం పెంచాలని,మళ్ళీ వర్షాకాలం మొదలైతే రాకపోకలకు ఇబ్బందులు పడాల్సి వస్తుందని, సంబంధిత అధికారులు వంతెన నిర్మాణ పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు. తుంపల్లి, అంకుసాపూర్ గ్రామానికి వెళ్లే దారిలోని వాగుపై లోలెవల్ వంతెనతో వరదలు వచ్చినప్పుడు పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి.

## పొంచి ఉన్న ప్రమాదం

**మామడ, ప్రభాతవార్త**

మండలంలోని దిమ్మదుర్తి నుండి నాల్దుర్తి వెళ్లే మార్గం గుండా వర్షాలకు రహదారి విరిగి పోవడం జరిగింది. ఈ దారి గుండా వెళ్లే ప్రయాణికులు ఇబ్బందికి గురి అవుతున్నారు. రాత్రి వేళలో ప్రయాణించాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తుంది. ద్విచక్ర వాహనాలు ఎక్కడ అదుపుతప్పి పడిపోతాయో అని ప్రమాదకరంగా ప్రయాణం కొనసాగించాల్సి వస్తుంది. ఇకనైనా సంబంధిత అధికారులు గుర్తుంచి మార్మతులు చేయాలనీ ప్రయాణికులు, గ్రామస్తులు కోరుతున్నారు.

